# రాహుల్ గాంధీపై ఆ కుట్రలు ఫలించవు



హైదరాబాద్: అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర చేస్తోన్న రాహుల్ గాంధీని అడ్డుకోవడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ధోరణి మంచిది కాదని హితవు పలికారు. రాహుల్ భద్రత విషయంలో సైతం ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. "ఇలాంటి చర్యలతో రాహుల్ గాంధీ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న కుట్రలు ఫలించవు. మరింత మనోధైర్యంతో ఆయన ముందుకు సాగుతారు. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు అండగా ఉన్నారు. ఈ దేశ ప్రజల మద్దతు ఆయనకు ఉంది. తెలంగాణ సమాజం కూడా రాహుల్ గాంధీకి అండగా ఉంటుంది. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు అండగా, పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో రాహుల్ గాంధీ తలపెట్టిన ఈ యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుంది"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# రాంగ్ డైరక్షన్ లో గులాబీ పార్టీ

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలన్నర కూడా కాలేదు. గట్టిగా నలభై రోజులు మాత్రమే అయింది. అయితే పదేళ్ల పాటు రెండు టర్మ్‌లు ప్రభుత్వం నిర్వహించిన బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం సమయంఇవ్వాలనుకోవడం లేదు. అనేక హామీలు ఇచ్చారని ఉన్న పళంగా అమలు చేయాలని విమర్శలు ప్రారంభించారు. ఆరు గ్యారంటీ హామీలను వంద రోజుల్లో అమల్లోకి తెస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఉచిత బస్సుపథకాన్ని రెండు, మూడు రోజుల్లోనే అమల్లోకి తెచ్చేసింది. మిగతా పథకాల కోసం దరఖాస్తులు తీసుకుంది. ప్రస్తుతం అవి ప్రాసెస్‌లో ఉన్నాయి. ఏది ఏమైనా వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వంచెబుతున్నప్పటికీ తగ్గడం లేదు. రోజు రోజుకు విమర్శల వేడి పెంచుతూనే ఉన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా మరో పరీక్ష రాజకీయ పార్టీలకు ఎదురుగా ఉంది. అదే పార్లమెంట్ ఎన్నికలు. జమిలీఎన్నికలు వద్దనుకున్న కేసీఆర్ గతంలో ఆరు నెలల ముందుగా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లారు. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంం కంటే బీజేపీ మెరుగ్గా ఉంది. జాతీయ స్థాయి అంశాలపై ఓటింగ్ జరగడం ఖాయంగా మారింది. తెలంగాణ అంశాలు వెనుకబడిపోతున్నాయి. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినప్పటికీ పార్లమెంట్ఎన్నికలు వచ్చే సరికి జాతీయ అంశాలపై ఓటింగ్ జరగడంతో బీజేపీ నాలుగు సీట్లు గెల్చుకుంది. కాంగ్రెస్ కూడా మూడు సీట్లు గెల్చుకుంది. బీఆర్ఎస్ తొమ్మిది సీట్లకు పరిమితమయింది. ఈ సారి అధికారంలో లేదు. అప్పటికన్నా బీజేపీ ఇప్పుడు బలంగా కనిపిస్తోంది ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు బీజేపీకి ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండు జాతీయ పార్టీల మధ్య బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగించడం అంతతేలిక కాదు. అసలు బీఆర్ఎస్ ప్రస్తావన లేకుండా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా పోలింగ్ సాగితే బీఆర్ఎస్ ఘోరమైన ఫలితాల్ని చూడాల్సి వస్తుంది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినందుకే స్థానిక క్యాడర్ కాంగ్రెస్ బాటపడుతున్నారు. మన్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో ఉన్న క్యాడర్ అంతా కాంగ్రెస్ వైపు పరుగులు పెడుతున్నారు. వారిని ఆపడం బీఆర్ఎస్ పెద్దలకు సాధ్యం కావడం లేదు. రేపు పార్లమెంట్ ఎన్నికల్లో గత ఎన్నికల్లోసాధించిన సీట్లు అయినా సాధించకపోతే బీఆర్ఎస్ పార్టీని ఫోర్స్ గా నడపడం సాధ్యం కాదు. వలసలు పెరిగిపోతాయి. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ బీఆర్ఎస్ నేతల్ని పంచుకునే ప్రమాదం ఉంది. బీఆర్ఎస్ మళ్లీ పుంజుకోవడంకష్టమన్న భావనకు వస్తే ఆ పార్టీలోని నేతలంతా తలోదారి చూసుకుంటారు. అందుకే.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా మెరుగైన ఫలితాల్ని సాధించాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే సమయం కూడాఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం ప్రారంభించిందన్న వాదన వినిపిస్తోందిఅప్పుడేనా అని కాంగ్రెస్ పార్టీ నుంచి.. ప్రజల నుంచి కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా బీఆర్ఎస్ మాత్రం తగ్గకూడదనిడిసైడయింది. ముప్పై యూట్యూబ్ చానళ్లు ఉంటే గెలిచేవాళ్లమని కేటీఆర్ అనుకున్నట్లుగా.. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో ఆ తప్పు జరగకూడదని పెద్ద ఎత్తున యూట్యూబ్ చానళ్లను రంగంలోకి దించుతున్నారనిరాజకీయవర్గాలు చెబుతున్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్ ను కూడా రంగంలోకి దించుతున్నారు. ముందు ముందు బీఆర్ఎస్ కార్యకర్తల్ని రోడ్లపైకి ఎక్కించే కార్యక్రమం కూడా ఉంటుందని చెబుతున్నారు .పార్లమెంట్ ఎన్నికలకు మోర నెలన్నరలో షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత మొదటి విడతలోనే ఎన్నికలు జరుగుతాయి.

అంటే ఎలా చూసినా రెండు నెలల సమయం ఉంది. కాంగ్రెస్‌కు వంద రోజుల సమయంఇస్తే ఆ లోపు లోక్ సభ ఎన్నికలు పూర్తయిపోతాయి. ఆ తర్వాత చేయగలిగిందేమీ ఉండదు. అందుకే బీఆర్ఎస్ తొందరపడుతోంది.బీఆర్ఎస్ ఇప్పుడే కాంగ్రెస్ పై పోరాటం చేయడానికి.. ఆ పార్టీపై వ్యతిరేకత ఉందనిచెప్పడానికి ప్రయత్నించేందుకు తొందరపడటానికి మరో కారణం కూడా ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పది కన్నా తక్కువ లోక్ సభ సీట్లు సాధిస్తే.. ప్రజావోదం కోల్పోయిందని.. ఆపరేషన్ ఆకర్ష్ ప్రయోగించి..ప్రభుత్వాన్ని మార్చవచ్చన్న ఆలోచన కూడా బీఆర్ఎస్ కు ఉందంటున్నారు. బీజేపీ సహకారంతో ఇలాంటివి ఇతర ప్రభుత్వాల్లో జరిగాయి.


# విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడవబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



సంప్రదించాల్సిన నంబరు: 9010972526

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను


# ధరణి పోర్టల్ ప్రారంభం నుంచే అనేక లోపాలు

హైదరాబాద్,జనవరి23 : వీలయినంత తొందరగానే ధరణి సమస్యలపై మధ్యంతర నివేదిక ఇస్తామని కోదండరెడ్డి నేతృత్వంలోని కమిటీ తెలిపింది. మూడోసారి సీసీఎల్ఏలో సమావేశమైన కమిటీ.. అనేక అంశాలపై చర్చించింది. ధరణి పోర్టల్ ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, బాధితులకు ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ధరణి వెబ్ సైట్ లోపభూయిష్టంగా ఉండటంతో…అనేక మంది రైతులు భూ హక్కులు కోల్పోయారని కమిటీ సభ్యులు కోదండరెడ్డి వెల్లడించారు. ఈ పోర్టల్‌లో పారదర్శకత లేదన్న ఆయన, భూమి యజమానికి తెలియకుండా లావాదేవీలు జరిగాయన్నారు. అనేక తప్పిదాల కారణంగా అన్నదాతలు… రైతుబంధు, ఇతర ప్రభుత్వ రాయితీలను పొందలేకపోయారని స్పష్టం చేశారు. ధరణి బాధితులకు త్వరితగతిన ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మరింత లోతైన అధ్యయనం చేయకుండా ముందుకు వెళ్లలేమని తెలిపారు. పోర్టల్ సమస్యలతో పాటు దానితో ముడిపడి ఉన్న అన్ని శాఖలతో చర్చించి సమగ్రమైన నివేదిక సిద్ధం చేయాల్సి ఉందని వెల్లడించింది.వాస్తవికతకు అద్దం పట్టేలా భూరికార్డుల కంప్యూటరైజ్డ్ చేయాల్సిన అవసరం ఉంటుందని ధరణి కమిటీ తెలిపింది. ధరణిలో ఒక సమస్యకు మరో సమస్యకు పొంతన లేకుండా ఉన్నాయని, ధరణి ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, ధరణి వల్ల భూ హక్కు హరించిపోయిందని చెప్పింది. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్లతో పాటు వ్యవసాయ, రిజిస్ట్రేషన్ శాఖలతో కూడా సమావేశమవుతామని కమిటీ తెలిపింది. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల్లోకి వెళ్లి, సమగ్రంగా అధ్యయనం చేశాకే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వెల్లడించింది. ధరణి వచ్చిన తర్వాత వెంటనే పనులు జరగడం బాగానే ఉన్న, పారదర్శకత కొరవడిందన్నారున ఇదొక పెద్ద సమస్యగా పేర్కొన్న కమిటీ, మరింత లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది.భూములు కంప్యూటరైజ్డ్ అంటే వాస్తవికతకు అద్దం పట్టాలని, ధరణిపై చాలా కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తెలిపింది. ధరణి సబ్జెక్టుపై అవగాహన కలిగిన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ పాల్గొంటామని, భూ యజమానికి తెలియకుండా భూ లావాదేవీలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించింది. పోర్టల్ పేరు ఏదైమైనా హక్కుదారి పేరు ఆన్లైన్లో ఉంటే అతనికి చట్టం పరంగా హక్కు ఉన్నట్లేనని, ధరణి కోసం పగడ్బందీగా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని రెండు, మూడు అంచెలుగా పూర్తి చేయాలని కమిటీ భావిస్తోంది. ధరణి పోర్టల్ వల్ల భవిష్యత్లో ఎలాంటి సమస్యలు రాకుండా, చాలా సునిశితంగా చర్చించినట్లు కమిటీ తెలిపింది. మరోవైపు భూముల వివరాలను దాచి పెట్టుకునేందుకు ధరణిలో రైట్ టు ప్రైవసీ అప్షన్ కూడా ఉంది. దీనికి సంబంధించిన బటన్ నొక్కితే సంబంధిత భూముల వివరాలు పోర్టల్‌లో సాధారణంగా కనిపించవు. సాఫ్ట్‌వేర్ నిర్వహించే వ్యక్తులు, తహసీల్దారు, రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రమే కనిపిస్తాయి. అంది కూడా లాగిన్‌లోకి వెళ్లి చూడాల్సి ఉంటుంది. ఈ తరహా వెసులుబాట్లను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడినట్లు సర్కార్ భావిస్తోంది. హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో ప్రభుత్వ భూములు చేతులు మారాయి. ఏదో ఒక ఉత్తర్వును ఆధారంగా చేసుకొని అధికారుల సహకారంతో వారి పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ధరణిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తామని ఇప్పటికే స్పష్టం చేసింది. ఓ జిల్లా అధికారి 89 లావాదేవీలను ఆన్‌లైన్ చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. కొత్త ప్రభుత్వం అక్రమాలు జరిగినట్లుగా భావిస్తున్న సర్వే నంబర్లను ఇందులో ఉండటంతో తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం.

## కాంగ్రెస్‌ను భవిష్యత్తులోనూ వెంటాడనున్న

# చారిత్రక వైఫల్యాలు



### సెక్యులరిజం నిర్వచనంపై గాని, దాని ఆచరణపై స్పష్టత లేదు

**- సమర్థవంతమైన పాలనపై చిత్తశుద్ధి లేదు విధానాలు - అయోధ్య గురించిన ఎప్పటినుంచో ఉన్న చర్చ**

**- అందిన ఆహ్వానంపై కాంగ్రెస్ నాయకత్వం వెంటనే ఒక నిర్ణయం తీసుకోలేకపోయింది**

హైదరాబాద్ : ఈ దశాబ్దాల కాలపు నూటొక్క వైఫల్యాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఈ రోజుకు కూడా కోలుకోలేదు. ఇప్పటికీ వారికి సెక్యులరిజం నిర్వచనంపైగాని, దాని ఆచరణపై గాని స్పష్టత లేదు. అందరి అభివృద్ధి, అందరి సంక్షేమం, సమర్థవంతమైన పాలనపై విధానాలు లేవు, చిత్తశుద్ధి లేదు. ఓట్ల కోసం రకరకాల సరికొత్త డ్రామాలు తప్ప. అయోధ్యపై నాయకత్వానిది డైలమా, అస్పష్టత అయితే అదే పార్టీ నాయకులు వేర్వేరు స్వరాలతో మాట్లాడుతుండటం వెనుక ఈ విధమైన దశాబ్దాల వైఫల్యాలు మూల కారణంగా ఉన్నాయి. పార్టీ ప్రస్తుత నాయకత్వం బలహీనమైనది గనుక ఈ చారిత్రక వైఫల్యాలు కాంగ్రెస్‌ను భవిష్యత్తులోనూ వెంటాడుతూనే ఉంటాయి. అయోధ్య గురించిన చర్చ ఎప్పటినుంచో ఉన్నదే అయినా, తమకు అందిన ఆహ్వానంపై కాంగ్రెస్ నాయకత్వం వెంటనే ఒక నిర్ణయం తీసుకోలేకపోయింది. దానినిబట్టే ఈ విషయమై పార్టీకి ఒక డైలమా ఎదురైనట్టు అందరికీ అర్థమైంది. కాంగ్రెస్ తనను తాను సెక్యులర్‌గా ప్రకటించుకున్నందున వాస్తవానికి ఎటువంటి డైలమా ఉండకూడదు. అయోధ్య ఆహ్వానం రాగలదన్నది ముందే తెలిసిన విషయమైనప్పుడు, నిర్ణయం కూడా ఎంతో ముందుగానే తీసుకొని ఉండవలసింది. కానీ, ఆ పని ఎందుకు చేయలేకపోయింది? చివరికి, తాము రామునికి గాని, ఆలయానికి గాని వ్యతిరేకం కాదని, ఆ కార్యక్రమాన్ని బీజేపీ ఒక రాజకీయ కార్యక్రమంగా మార్చినందున, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లాభపడజూస్తున్నందున, ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నామని వివరించబూనింది.అయోధ్య కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేయటం, ఎన్నికల కోసం ఉపయోగించుకొనజూడటం నిజం. అందులో రహస్యం లేదు, కొత్త విషయం కూడా లేదు. వారు అయోధ్యను కేంద్రం చేసుకొని గాని, హిందూ మత సంబంధమైన అనేక ఇతర అంశాలను ఉపయోగించుకుంటూ గాని ఈ తరహా పనులు కొన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. అంతిమంగా హిందూ రాష్ట్ర స్థాపన తమ లక్ష్యమని బీజేపీ అధికారికంగా ప్రకటించకపోయినా (అందుకు రాజ్యాంగ పరిమితులు, చట్టపరమైన పరిమితులున్నందున), ఆ పార్టీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ లక్ష్యం వందేండ్లుగా అదే. గతంలో జనసంఘ్, తర్వాత బీజేపీ చేస్తున్నది రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని అందుకు మార్గాన్ని సుగమం చేస్తూ పోవటమే. ఇదంతా కాంగ్రెస్‌కు సైతం మొదటినుంచీ తెలుసు. అదే అజెండాను బీజేపీ ఇప్పుడు అయోధ్య అనే సాధనం ద్వారా మరికొంత ముందుకు తీసుకుపోజూస్తున్నది. సెక్యులరిజం అనే దృక్పథాన్ని, ఆ పేరిట కాంగ్రెస్‌తో సహా అనేక మధ్యేమార్గ పార్టీలు, వామపక్షాలు తీసుకునే వైఖరులను బాహాటంగా ఖండిస్తున్నది.ఇదంతా మనం చిరకాలంగా చూస్తున్నదే. అదే స్థితి ఇప్పుడు అయోధ్య సందర్భంగా మరొకసారి ముందుకువస్తున్నది. అయితే, దీనంతటికి భిన్నంగా కాంగ్రెస్ చెప్తూ వస్తున్నది, చేస్తూ వస్తున్నది ఏమిటి? సెక్యులరిజాన్ని నిలబెట్టడానికి గాని, హిందూ మతతత్త భావనలు వ్యాపించకుండా నిరోధించేందుకు గాని వారి వ్యూహం ఏమిటి? ఆ ప్రకారం చేసిన ఆచరణలు ఏమిటి? అన్నవి ఆలోచించవలసిన ప్రశ్నలు. అవి అర్థమైతే తప్ప, కాంగ్రెస్ డైలమాలు, సంకట పరిస్థితులు, తరచూ కనిపించే తడబాట్లు, ద్వంద్వనీతి మనకు అర్థం కావు.కాంగ్రెస్ పార్టీ తమది సెక్యులర్ విధానమని మొదటనే ప్రకటించింది. తర్వాత ఆ మాటను రాజ్యాంగంలో చేర్చింది. అంతవరకు పార్టీ విధానం పూర్తిగా సమర్థించదగినదే. దేశ జనాభా స్థితిగతులను బట్టి, దేశ విభజన పరిస్థితులను బట్టి, దేశం ఆధునిక ప్రజాస్వామ్య మార్గంలో పురోగమించవలసిన లక్ష్యాలను బట్టి అది సరైన నిర్ణయమే. కానీ, సెక్యులరిజం అనే మాటను నిర్వచించటంలో, ఆచరించటంలో తొలుతనే సమస్యలు ఎదురయ్యాయి. మనది మతాతీత వ్యవస్థ లేక, సర్వమత సమభావనా వ్యవస్థ అన్నది మొదటి చర్చ అయింది. ఆ చర్చల వివరాల్లోకి పోలేముగాని మొత్తానికి అదొక అస్పష్ట నిర్వచనంగా మిగిలిందని గుర్తించాలి. ఆ కారణంగా ఆచరణ కూడా అస్పష్టమైన విధంగానే సాగింది. ఇందువల్ల అసలు సమస్య ఎక్కడ వచ్చిందంటే, మనది ఎవరు అవునన్నా కాదన్నా హిందూ మెజారిటీ దేశం అయినందున, ఈ అస్పష్టతలు క్రమక్రమంగా కాంగ్రెస్ డైలమాలకు, బీజేపీకి పరిస్థితులు అనుకూలం కావటానికి వీలు కల్పించాయి. యథాతథంగా ఈ నిర్వచన అస్పష్టతలు, ఆ ప్రకారం ఆచరణ అస్పష్టతలు ఇందుకు ఒక కారణమైతే, అంతకన్న అనేక రెట్లు కారణమైన విషయం మరొకటి ఉంది. అది, మన దేశంలో సెక్యులరిజం అనేది సరైన పునాదులపై నిలబడేందుకు, బలంగా నిర్మాణమయ్యేందుకు చేయవలసిందేమిటనే అవగాహన గాని, వ్యూహం గాని, అందుకు తగిన ఆచరణగాని కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ లేవు. ఇటువంటి అవగాహనకు, వ్యూహానికి, ఆచరణకు ఇరుసుగా పనిచేసే అతి కీలకమైన అంశం అన్నివర్గాల అభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలన. కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయాల్లో విఫలం కావటానికి, అందుకు పర్యవసానంగా సెక్యులర్ ప్రకటనల వైఫల్యానికి అవినాభావ సంబంధం ఉన్నది. ఈ వైఫల్యాలన్నింటి ఫలితంగా అన్ని విధాలుగానూ ఒక పెద్ద శూన్యం ఏర్పడి, ఆ శూన్యంలోకి బీజేపీ విజయవంతంగా ప్రవేశించింది. వరుసగా కొన్ని దశాబ్దాల పాటు పరిపాలించి కూడా కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమాలే మౌలికంగా అరకొరగా మిగిలాయి. కనుక అన్నివర్గాల అభివృద్ధి అనేది గాని, అన్నివర్గాల సంక్షేమం అన్నది గాని కూడా అరకొరగానే ఉండిపోయాయి. మరొకవైపు సమర్థవంతమైన పరిపాలనా లేకపోయింది. ఇవి చాలవన్నట్టు విపరీతమైన అవినీతి, నిరుద్యోగం, పేదరికం, పైనుంచి కిందివరకు దోపిడీ. ఈ స్థితికి, సెక్యులరిజానికి, బీజేపీ బలోపేతం కావటానికి గల కార్యకారణ సంబంధాన్ని సూక్ష్మంగా ఒక మాటలో చూద్దాం. అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా వైఫల్యాల చెడు ప్రభావాలు హిందువులపై, ముస్లింలపై కూడా ఉన్నాయి. మతాలతో సంబంధం లేకుండా అందరిపై గల ప్రభావాల గురించి అనేక అధ్యయనాలున్నాయి. ముస్లింల విషయమై జస్టిస్ రాజేంద్ర సచార్ ప్రత్యేక నివేదిక ఉన్నది. అయినప్పటికీ తమ వెనుకబాటుకు కాంగ్రెస్ తదితర పార్టీలు ముస్లింలను 'బుజ్జగించట'మే కారణమని హిందువులను నమ్మించేందుకు బీజేపీకి మంచి అవకాశం లభించింది. అందుకు సెక్యూరిటీ అంశాలు, కశ్మీర్, పాకిస్థాన్ వంటివి కూడా వారికి కలిసివచ్చాయి. వీటికి వేటికీ కాంగ్రెస్ వద్ద సమాధానాలు లేకపోయాయి. ఎప్పుడైనా, ఏ సమాజంలోనైనా మతం, జాతీయత, దేశ భద్రత అనే మూడు కూడా బలమైన అంశాలు. ఇంగ్లీషు మాటల్లో చెప్పాలంటే బేసిక్ ఇన్‌స్టింక్ట్స్ వంటివి. ఈ మూడింటిలో కాంగ్రెస్ పరిస్థితి గానీ, సెక్యులర్ విధానం గానీ ప్రజల్లో బలంగా పాదుకొనాలంటే అన్నింటికి ముందు జరగవలసింది ప్రజలందరినీ అభివృద్ధి, సంక్షేమం, పరిపాలన విషయాల్లో సంతృప్తిగా ఉంచటం. ఇంచుమించు అన్నింటికి, దాదాపు అన్ని పరిస్థితుల్లో అదే పునాది అవుతుంది. అసాధారణ పరిస్థితులు ఏవైనా తలెత్తితే తప్ప. కానీ కాంగ్రెస్ వరుస వైఫల్యాలు మనకు తెలిసినవే. ఈ వైఫల్యాల వల్లనే ఆ పార్టీ పరాజయాలు నెహ్రూ జీవించి ఉన్నప్పుడు 1957 ఎన్నికల నుంచే మొదలయ్యాయి. 1960లలో శ్రామికులు, యువకుల అశాంతి, నక్సలిజం, 1970లలో ప్రాంతీయ పార్టీల రాక, ఎమర్జెన్సీ వంటివాటితో మరిన్ని కాంగ్రెస్ పరాజయాలు నమోదయ్యాయి. గమనించదగినదేమంటే, ఈ ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికల గెలుపు ఒక జీవన్మరణ సమస్యగా మారిన కాంగ్రెస్ పార్టీ నిజంగానే ముస్లింల బుజ్జగింపు విధానాన్ని అనుసరించింది. వాస్తవానికి చేయవలసింది అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా రంగాలలో గల వైఫల్యాలను సరిదిద్దుకొని హిందువులు, ముస్లింలనే తేడా లేకుండా అందరినీ బాగుపరచటం. అందరి మద్దతు సంపాదించటం. ఆ విధంగా సెక్యులరిజాన్ని కూడా నిలబెట్టడం. కానీ ఆ పనిచేయ లేదు. విచిత్రం ఏమంటే, ఎన్నికల భయంలో ఒకవైపు ముస్లింల బుజ్జగింపుతో వారిని ఓటు బ్యాంకుగా మార్చుకొనజూస్తూ, దానిపై విమర్శలు రావటంతో హిందువుల ఓట్ల కోసం భయపడి సాఫ్ట్ హిందూత్వ కార్డును ఉపయోగించటం కూడా మొదలుపెట్టారు. అదొక డబుల్ గేమ్ అయి క్రమంగా రెండూ దెబ్బతీసాయి. బుజ్జగింపు గురించిన విమర్శలను బీజేపీ చేయగా, కొన్నాళ్లకు స్వయంగా ముస్లింలు కూడా కాంగ్రెస్ తమ అభివృద్ధికి చేయవలసింది చేయక బీజేపీ బూచిని చూపి ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నదని ఆక్షేపించసాగారు.

# జిల్లాలో 2.59 లక్షల మందికి రూ.177.52 కోట్ల ఆసరా సాయం

## నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులను విడుదల చేసిన సి ఎం



విశాఖపట్నం, జనవరి 23, (ప్రజా కలం) వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా విశాఖపట్నం జిల్లా నుంచి 2,59,231 మంది మహిళలు రూ.177.52 కోట్ల మేర ఆర్థిక లబ్ధి పొందారు. వరుసగా నాలుగో ఏడాదికి సంబంధించిన నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ వేదికగా జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ప్రారంభించగా, జిల్లా స్థాయి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఇతర అధికారులు భాగస్వామ్యమయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం విశాఖపట్నం జిల్లాలో లబ్దిదారులకు మంజూరైన రూ. 177.52 కోట్ల మొత్తాన్ని చెక్కు రూపంలో జిల్లా రెవెన్యూ అధికారి, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కె.కె. రాజుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో భాగంగా శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి మాట్లాడారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టినా ఆ పథకం మహిళలకే చెందేలా అమలు చేయడం హర్షనీయమన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూతతో పాటు గృహాలను కూడా మహిళల పేరునే మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇటువంటి కార్యక్రమాలు అమలు చేయడం వలన సమాజంలో మహిళలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మధ్య తరగతి మహిళలకు ఆర్థిక భరోసా అందుతోంది. మా గ్రూపులో సభ్యులందరం ఉపయోగపడే పనులు చేసుకుంటూ కుటుంబ పోషణకు చేయూత అందిస్తున్నాం. ప్రస్తుతం విడుదల చేసిన నాలుగో విడత నగదు పంపిణీతో మా గ్రూపు సభ్యులందరం వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని ఆనందపురం కు చెందిన మీసాల లక్ష్మి, ఆనందం వ్యక్తం చేసారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ ఆసరా పథకం దోహద పడుతుంది. మా గ్రూపు సభ్యులకు ఇప్పటి వరకు సుమారు రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరింది. గ్రూపులో సభ్యులు ఎక్కువగా వస్త్ర వ్యాపారం, పూల వ్యాపారం, కాయగూరల వ్యాపారం చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా నగదుతో ఆర్థిక భరోసా అందుతోందని భీమిలికి చెందిన గందవరపు పార్వతి అన్నారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ ఛైర్మన్ కె.కె. రాజు, నగరాల కార్పొరేషన్ ఛైర్పర్సన్ పిల్లా సుజాత, కార్పొరేటర్లు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఇతర అధికారులు, పలువురు మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జీవీఎల్ ఆధ్వర్యంలో 26 ,27 తేదీలలో రిపబ్లిక్ డే ఉత్సవ్.

విశాఖపట్నం, జనవరి 23, (ప్రజా కలం).. రిపబ్లిక్ డే ఉత్సవ్ పోస్టర్, టీజర్ ను ఎంపీ జివిఎల్, మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, బీజేపీ నాయకులు అవిష్కరించారు. ఈ సంధర్భంగా జి వి ఎల్ మట్లాడుతూ నిన్న అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్టతో దేశం అంతా పులకించిందన్నారు. దేశాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో ప్రధాని మోదీ ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ ఏడాది 75 వ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరుపుకొనున్నామని ఈ మహత్తర కార్యక్రమానికి ఆర్కే బీచ్ వేదిక కానుందన్నారు. రిపబ్లిక్ డే ఉత్సవ్ లో భాగంగా బీచ్ రోడ్ లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గణతంత్ర దినోత్సవం ఈనెల 26 తేదీన ఉదయం బీచ్ రోడ్డు లో ఫ్రీడమ్ కలర్స్ వాక్ నిర్వహించబోతున్నామన్నారు. జాతీయ భావాన్ని నింపాలనే ఉద్దేశంతో ఫ్రీడమ్ కలర్ వాక్ నిర్వహిస్తున్నామని, మధ్యాహ్నం 3 గంటలు నుంచి 6 గంటలు వరకు దేశభక్తితో కూడుకున్న ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని, 26,27 తేదీలలో సాయంత్రం మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసామన్నారు. సెలబ్రిటీలు, కళాకారులు మ్యూజికల్ నైట్ లో పాల్గొంటారని అన్నారు. విశాఖ వాసులకు అభివృద్ధితోపాటు ఆనందాన్ని పంచాలనే సంకల్పంతో ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నామని, నగర వాసులు పెద్ద ఎత్తున రిపబ్లిక్ డే ఉత్సవ్ లో పాల్గొనాలన్నారు.



రాజకీయాలకు అతీతంగా ఈ రిపబ్లిక్ డే ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా వరకే పరిమితమని, కాంగ్రెస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలపై స్పందించి వారిని హైలెట్ చేయవలసిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఉత్తుత్తి వాగ్దానాలకు గత ఎన్నికలలో ఉత్తుత్తి ఓట్లే పడ్డాయని, ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని, ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడో కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లిపోయాయన్నారు. దేశానికి మోదీ నాయకత్వం అవసరమని, ఆంధ్రప్రదేశ్ లో బిజెపిని ఆదరిస్తారని మాకు నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు.

# బొత్సాకు బాగోలేదా?



విజయనగరం : మంత్రి బొత్స సత్యనారాయణ కంచుకోట చీపురుపల్లిలో ఎదురీదుతున్నారు. ఆయన ఇతర మండలాల్లో వెనుక బడినా మొరకముడిదాం అనే మండలంలో భారీ మెజార్టీ వస్తుంది. ఈ కారణంగా ఆయన స్వల్ప తేడాతో అయినా బయటపడుతూ వస్తున్నారు. కానీ ఈ సారి ఆ మొరకముడిదాం మొత్తం ఈ సారి బొత్సకు మూడిందన్న సంకేతాలు పంపుతోంది. పార్టీ క్యాడర్ అంతా గుడ్ బై చెప్పి టీడీపీలో చేరుతున్నారు. వారిని ఆపేందుకు బొత్స మేనల్లుడు చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి. వారం రోజుల కిందట మండలంలో మేజర్ పంచాయతీ అయిన సోమలింగాపురం వైసీపీ నేతలంతా టీడీపీలో చేరిపోయారు. చంద్రబాబు సమక్షంలో కోట్ల సుగుణాకర్ రావు అనే నేతతో పాటు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు కూడా టీడీపీలో చేరారు. సుగుణాకర్ రావు పార్టీ మారడం బొత్సకు పెద్ద దెబ్బని భావిస్తున్నారు. ఆయనను ఆపేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. బొత్సకు ఏకపక్షంగా ఓట్లేసే గ్రామాల్లో ఇప్పుడు రెండు వర్గాలయ్యాయి. మరో వైపు టీడీపీ తరపున యువ నాయకుడు కిమిడి నాగార్జున సామాన్యుల్లో సామాన్యుడిగా తిరుగుతున్నారు. ప్రతీ గ్రామానికి వెళ్తున్నారు. అందర్నీ పలకరిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి అమెరికాలో మంచి ఉద్యోగం చేసుకుంటున్న ఆయన రాజకీయాల కోసం అన్నీ వదిలేసి వచ్చారు. ప్రభుత్వ నిర్వాకాలపై పోరాడుతున్నారు. మాజీ మంత్రి కిమిడి మృణాళిని కుమారుడు నాగార్జున. గత ఎన్నికల్లో చివరి క్షణంలో టిక్కెట్ దక్కించుకుని పోటీ చేశారు. ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటి పెట్టుకుని ఉన్నారు. ఆ ప్రయత్నాలు ఫలించే సూచనలు కనిపిస్తున్నాయి. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణకు...నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలే ఝలక్ ఇస్తున్నారు. అధికార పార్టీకి గుడ్ బై చెప్పి... ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పేసుకుంటున్నారు. బొత్స సత్యనారాయణ గెలుపులో కీలకంగా ఉన్న మెరకముడిదాం మండలంలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, కోట్ల సుగుణాకరరావు తీర్థం పుచ్చుకున్నారు. గద్దే బాబురావు... 1994, 1999లో చీపురుపల్లి అభ్యర్థిగా తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు.అటు కోట్ల సుగుణాకరావు...విజయనగరం జిల్లా వయోజన విద్యా శాఖ ఉప సంచాలకుడిగా పనిచేశారు. ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. సుగుణాకరరావు తండ్రి కోట్ల సన్యాసి అప్పలనాయుడు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 ఎన్నికల్లో సన్యాసి అప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. కోట్ల సుగుణాకరరావు కుటుంబానికి చెందిన వ్యక్తులే మెరకముడిదాం మండల జడ్పీటీసీ సభ్యులుగా, మండలాధ్యక్షులుగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావుకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటంతో...చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీ బలపడుతుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పలు పంచాయతీల సర్పంచ్ లు, ఎంపీటీసీలు... వైసీపీ వీడి తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటున్నారు. బొత్స అనుచరులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా...వలసలు మాత్రం ఆపలేకపోతున్నారు. కోట్ల సుగుణా కరరావుకు జిల్లా వ్యాప్తంగా బంధుత్వాలు, విస్తృత పరిచయాలు ఉన్నాయి. సుగుణాకరరావు బాటలోనే మరికొందరు నేతలు పయనించే అవకాశం ఉంది. బొత్స సత్యనారాయణకు చీపురు పల్లి నియోజకవర్గం పెట్టని కోట. ప్రస్తుతం జగన్ కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు మున్సిపల్ మంత్రిగా పని చేశారు. బొత్స సత్యనారాయణ ...బొబ్బిలి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1999 లో ఎంపీగా గెలుపొం దారు. 2004 నుంచి 2019 వరకు నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే... 2014లో మాత్రమే ఓటమి పాలయ్యా రు. 2004, 2009లో కాంగ్రెస్ తరపున, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో భారీ పరిశ్రమలు, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ, రవాణా, మార్కెటింగ్ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. చీపురుపల్లి నియోజకవర్గంలో మూడు సార్లు గెలిచిన ఏకైక రాజకీయ నేత. రాష్ట్ర రాజకీయాల్లో కీలకనేతగా ఎదిగారు. విజయనగరం జిల్లాలో ఏ పార్టీ మెజార్టీ నియోజకవర్గాల్లో గెలుపొం దాలన్న...బొత్స సత్యనారాయణ సపోర్టు తీసుకోవాల్సిందే. అంతలా విజయనగరం జిల్లాపై పట్టుబిగించారు.

# సాంకేతిక పరిజ్ఞానంతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

### సైబర్ నేరాలపై రెండు రోజుల శిక్షణ సదస్సులో డీసీపీ కె. శ్రీనివాసరావు
### భాగస్వామ్యమైన సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సలర్,
### అనకాపల్లి ఎస్పీ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి



విశాఖపట్టణం, జనవరి 23, (ప్రజా కలం).. ప్రతి పౌరుడూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని డీసీపీ కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిన్నచిన్న చదువులు చదివిన వారే ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని వారిని ఎదుర్కోవటంలో ఉన్నత చదువులు చదివిన వారు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మోసాల్లో ఎక్కువ శాతం ఇలాంటి కేసులే ఎదురయ్యాయని గుర్తు చేశారు. సాంకేతిక పరికరాలను ఉపయోగించే క్రమంలో మెళకువలు తెలుసుకోవాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, వాటిని అరికట్టే విధానాలపై విస్తృత అవగాహన కల్పించే నిమిత్తం ఏపీ సీఐడీ విభాగంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలి రోజు మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సలర్, సీఐడీ విభాగం అదనపు ఎస్పీ రవివర్మ, ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరు జిల్లాల నుంచి హాజరైన పోలీసు, బ్యాంకు, ఇతర విభాగాల అధికారులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉంటారో, సామాన్య పౌరులు కూడా అంతే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మారుతున్న సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. ఇంటర్నెట్, మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, ఓటీపీలు, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ ఆర్థిక వ్యవహారాలు నిర్వహించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, తరచూ పాస్‌వర్డులు మార్చుకోవాలని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచకపోవటం ఉత్తమని పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగుల జోలికి పోరాదని హితవు పలికారు. ఎల్.హెచ్.ఎం.ఎస్. (లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం)పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోసాలు జరిగినప్పుడు టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని, సైబర్ క్రైం విభాగంలో రిపోర్టు చేయాలని చెప్పారు. రోజురోజుకూ పెరుగుతున్న కొత్తతరం మోసాల వల్ల సమాజంలో అశాంతి నెలకొందని, ప్రతి ఒక్కరూ సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణలు సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసు చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. మరింత లోతైన అవగాహన పెంచుకోవడానికి, నేరాలను అరికట్టడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.ఏపీ డీజీపీ, ఏపీ సీఐడీ ఏడీజీ ఆదేశాల మేరకు విశాఖపట్టం సీఐడీ ఆర్వో పరిధిలోని ఆరు జిల్లాల్లో పని చేస్తున్న పోలీసు, బ్యాంకు అధికారులకు, సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ సదస్సులు నిర్వహిస్తున్నామని సీఐడీ విభాగం అదనపు ఎస్పీ రవివర్మ తెలిపారు. సదస్సులో భాగంగా సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్ను ఆవిష్కరించారు. సదస్సులో వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, విశాఖపట్టణం సీఐడీ ఆర్వో పరిధిలోని అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నగరిలో రోజా దారెటు?



తిరుపతి : ఏపీలోని సెలబ్రిటీ నియోజకవర్గాల్లో ఒకటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం. టీడీపీ కంచుకోట లాంటి నియోజకవర్గంలో రెండు సార్లు రోజా గెలిచారు. మరి ఈ సారి గెలుస్తారా అంటే అసలు టిక్కెట్ ఇస్తారా అన్న చర్చ ఎక్కువ జరుగుతోంది. గత రెండు సార్లు ఆమె గెలవడానికి తమిళ ఓటర్లు కీలకం. ఇటీవల రజనీకాంత్ పై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి ఈ సారి వారినీ దూరం చేసుకున్నారు రోజా. ఇక సొంత నేతల సంగతి చెప్పాల్సిన పని లేదు. నియోజకవర్గంలో ఎవరితోనూ సఖ్యత ఉండని ఒకే ఒక్క నేత రోజా మంత్రి కావాలంటే ముందుగా ఎమ్మెల్యే కావాలి. ఎమ్మెల్యే అవ్వాలంటే నియోజకవర్గంలో పార్టీ నేతలందరితో సఖ్యతగా ఉండాలి. కానీ రోజా స్టైల్ వేరు. నగరి నియోజకవర్గంలో ఒక్క మండలం నేతతో కూడా ఆమె సఖ్యతగా ఉండరు. నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. ఐదు మండలాలకు చెందిన ముఖ్య నేతలు ఆమెకు వ్యతిరేకమే. ఈ ఐదుమండలాల నేతల్లో ఇద్దరు రాష్ట్ర స్థాయి పదవులు ఉన్న వారున్నారు. మిగిలిన వారు వారి వారి స్థాయిల్లో మండలాల్లో పట్టు ఉన్న వారు ఉన్నారు.జడ్పీటీసీలు లాంటి కీలక పదవుల్లో ఉన్న వారితోనూ ఇబ్బందులే. రోజాకు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి రాజకీయం ఎమ్మెల్యేపై ఇంత తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న నేతలు ఉన్నారంటే వారికి బలమైన సపోర్టు ఉన్నట్లే లెక్క. రోజా వ్యతిరేక వర్గానికి పెద్దిరెడ్డి సపోర్టు ఉంది. నగరిలో రోజాకు చెక్ పెట్టేందుకు మంత్రి పెద్దిరెడ్డి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారని కొంత కాలంగా అభిప్రాయం ఉంది. రోజాకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న వారికి పెద్దిరెడ్డి సపోర్ట్ ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తం తన గుప్పిట్లో ఉండాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుకుంచారు. కానీ రోజా ఆయనకు వ్యతిరేక వర్గంగా మారిపోయారు. గత రెండు సార్లు అందరూ కృషి చేసినా స్వల్ప తేడాతోనే రెండు సార్లు విజయం సాధించారు. నగరిలో తమిళ ఓటర్లు ఎక్కువగా ఉంటారు. రోజా భర్త సెల్వమణి తమిళుడు. ఈ తమిళ నేపథ్యం ఉపయోగపడింది. ఇటీవల రజనీకాంత్ పై ఆమె చేసిన వ్యాఖ్యలతో ఆ వర్గంలోనూ వ్యతిరేకత పెంచుకున్నారు. గతంలోనే ఐదు మండలాల నేతలు సమావేశం పెట్టి.. ఇక మరోసారి రోజాకు చాన్సిస్తే గెలిపించే చాన్సే లేదని తీర్మానించుకున్నారు. రోజాకు టిక్కెట్ నిరాకరించే ఉద్దేశంతోనే ఇలా వారిని ఎగదోస్తున్నారని రోజా వర్గీయుల్లో అనుమానాలు కూడా ఉన్నాయి. రోజా చేసే రచ్చ భయంతోనే టిక్కెట్ ఇచ్చే చాన్స్ రోజా.. జగన్ మోహన్ రెడ్డిపై నమ్మకంతో .. టీడీపీ వాళ్లను ఇష్టారీతిన తిట్టింది. పవన్ నూ వదల్లేదు. ఆమెకు వైసీపీ తప్ప మరో రాజకీయ వేదిక లేదు. ఉండదు కూడా. అలా అన్ని ఆప్షన్లను వదులుకుని ఉంటే.. ఇప్పుడు టిక్కెట్ నిరాకరిస్తారా అని ఆమె రెచ్చిపోతే జగన్ రెడ్డి, సజ్జల రెడ్డి తట్టుకోలేరన్నది ఎక్కువ మంది భావన. అయితే చివరికి వేరే వారికి టిక్కెట్ ఇచ్చినా ఆశ్చర్యం లేదన్న వాదన వినిపిస్తోంది.

